# సాక్షి మంచిర్యాల

శుక్రవారం । 30 । మే । 2025






**భవితకు భరోసా**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని భవిత కేంద్రాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. రూ.1.59 కోట్లు మౌలిక వసతుల కల్పన, మరమ్మతులకు వెచ్చించనున్నారు. 8లో▸



**మూగజీవాలకు షాక్**

జిల్లాలో విద్యుత్ వైర్లు తెగిపడి, కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు, ఎర్త్‌వైర్‌కు విద్యుత్ సరఫరా జరిగి కాడెడ్లు, గేదెలు, ఆవులు మృత్యువాత పడుతున్నాయి. 9లో▸

**వాతావరణం**

గరిష్టం/కనిష్టం
33.0 /27.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు బలంగా వీస్తాయి.

## న్యూస్‌రీల్

### శాంతిభద్రతల విషయంలో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

**మంచిర్యాలక్రైం:** శాంతిభద్రతల విషయంలో పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. రామగుండంలోని కమిషనరేట్ కార్యాలయంలో గురువారం ఆయన కమిషనరేట్ పరిధిలోని డీసీపీలు, అదనపు డీసీపీ(అడ్మిన్), ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల స్థితిగతులపై తెలుసుకున్నారు. నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సుదీర్ఘకాలం పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. బక్రీద్ పండుగ సందర్భంగా శాంతికమిటీ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో పెద్దపల్లి డీసీపీ కరుణాకర్, అదనపు డీసీపీ(అడ్మిన్) సి.రాజు, స్పెషల్ బ్రాంచి ఏసీపీ మల్లారెడ్డి, గోదావరిఖని ఏసీపీ రమేశ్, మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాశ్, అధికారులు పాల్గొన్నారు.

### 3నుంచి భూభారతి రెవెన్యూ సదస్సులు

**బెల్లంపల్లి:** రాష్ట్ర ఆవి ర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని వచ్చే నెల 3నుంచి భూభారతి చట్టం అ మలులో భాగంగా భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు బెల్లంపల్లి ఆర్డీవో పి.హరికృష్ణ తెలి పారు. గురువారం ఆయన చాంబర్‌లో ఏర్పా టు చేసిన సమావేశంలో మాట్లాడారు. బెల్లంపల్లి డివిజన్ పరిధిలో జూన్ 3నుంచి 20వరకు సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. రైతుల నుంచి భూసమస్యల దరఖాస్తులు స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అన్నా రు. జూన్ 2014 జూన్ 2కంటే ముందు భూమి కొనుగోలు చేసి 2020 అక్టోబర్ 12వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అర్జీదారుల సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. ఒక్కో మండలంలో సదస్సుల నిర్వహణకు రెండేసి బృందాలు ఏర్పాటు చేశామని చెప్పారు. తహసీల్దార్, నాయబ్ తహసీల్దార్ ఆధ్వర్యంలో గ్రామాల వారీగా సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. భూముల సరిహద్దుల మార్పు, పేర్ల సవరణకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వర్షాకాలం దృష్ట్యా జూన్‌లో వచ్చే మూడు నెలలకు సంబంధించి రేషన్ బియ్యం ఒకేసారి లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

### ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల నమోదు పెంచాలి



ప్రచార జాతను ప్రారంభిస్తున్న డీఈవో

**మంచిర్యాలఅర్బన్:** ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల నమోదు పెంచి బడి బలోపేతానికి కృషి చేయాలని డీఈవో యాదయ్య అన్నారు. గురువారం ఆయన స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన బడిబాట ప్రచార జాతను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ మౌలిక వసతులతోపాటు ఆంగ్ల మాధ్యమం, యూనిఫామ్, మధ్యాహ్న భోజ నం, పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. సెక్టోరల్ అధికారులు సత్యనారాయణమూర్తి, చౌదరి, శ్రీనివాస్, ఏసీజీఈ దామోదర్‌రా వు, డీఎస్‌వో మధుబాబు, రాష్ట్ర కార్యదర్శి శాంతికుమారి, జిల్లా అధ్యక్షుడు చక్రపాణి, ప్రధాన కార్యదర్శి రాజావేణు, ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్, కార్యదర్శులు చంద్రమౌళి, దేవదాస్, సంతోష్‌కుమార్, నర్సయ్య పాల్గొన్నారు.

# వీడని చిక్కులు!

ఇటీవల వేమనపల్లి మండలం చామనపల్లి గ్రామానికి చెందిన దళిత రైతులు అటవీ భూములు సాగు చేస్తున్నారంటూ కేసులు నమోదు చేశారు. తమకు రెవెన్యూ పట్టాలు ఉన్నాయని ఇటీవల కలెక్టర్ కుమార్ దీపక్‌కు రైతులు వినతిపత్రం ఇవ్వగా.. అటవీ అధికారులపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఇక్కడ కొన్నేళ్లుగా రైతులు సాగులో ఉన్నారు. ఆ శాఖ రికార్డుల్లో మాత్రం అటవీ భూమిగా ఉండడంతో అధికారులు తిరిగి స్వాధీనం చేసుకునేందుకు సిద్ధమయ్యారు.



తమకు రెవెన్యూ పట్టాలు ఉన్నాయని చూపిస్తున్న వేమనపల్లి మండలం చామనపల్లి రైతులు

- అటవీ, రెవెన్యూ భూముల మధ్య సమస్య
- గిరిజనేతరులు సాగులో ఉంటే తిప్పలే..
- పోడు సాగుదారుల ఆక్రమణలపై సర్వే
- అటవీ ఆక్రమణలుగా గుర్తించి స్వాధీనం

**సాక్షి ప్రతినిధి, మంచిర్యాల:** రెవెన్యూ, అటవీశాఖల మధ్య వివాదం తీరడం లేదు. జిల్లాలో ఇప్పటికీ పలు గ్రామాల్లో అటవీశాఖ అధికారులు, సాగుదారుల మధ్య ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో 2008లో, తెలంగాణ ఏర్పడ్డాక 2023లోనూ గిరిజన రైతులకు పట్టాలు ఇచ్చారు. రెండేళ్ల క్రితం ఇచ్చిన పోడు పట్టాల సమయంలో ఒక రైతుకు గుంట భూమి నుంచి గరిష్టంగా పదెకరాల వరకు సాగులో ఉన్నా పట్టాలు ఇచ్చారు. అదే సమయంలో జిల్లాలో గిరిజనేతర రైతులు ఏడు వేల మంది పట్టాల కోసం వినతులు ఇచ్చినా వారికి పట్టాలు ఇవ్వలేదు. అర్హులుగా గుర్తించిన గిరిజనులైన 1847మందికి మొత్తం 3,821 ఎకరాల్లో పోడు పట్టాలు ఇచ్చారు. ఇంకా ఆయా చోట్ల గిరిజనేతరుల చేతిలో అటవీ భూమి ఆక్రమణలో ఉంది. ఈ భూమిని తిరిగి శాఖ ఆధీనంలోకి తీసుకునేందుకు చర్యలు ప్రారంభించింది. ఆ రైతులకు నోటీసులు ఇస్తూ హద్దులు నిర్ణయిస్తున్నారు.

**తరచూ ఘర్షణలే..**

జిల్లాలో పలు చోట్ల అటవీ, స్థానిక గిరిజన, గిరిజనేతర రైతుల మధ్య ఘర్షణలు జరిగాయి. గతంలో దండేపల్లి మండలం కోయపోచగూడలో జరిగిన ఘటన పెద్ద దుమారమే రేపింది. జన్నారం మండలం ఇందన్‌పల్లి, నెన్నెల మండలం కుశ్నపల్లి, కోనంపేట, వేమనపల్లి మండలం బుయ్యారంలో ఆక్రమణలపై నిత్యం ఘర్షణ వాతావరణం నెలకొంది. వీటితోపాటు కోటపల్లి మండలం సుపాక, ఆలుగామ, రొయ్యపల్లిలో పలువురు గిరిజన రైతులు అటవీ భూములు సాగులో ఉన్నా తమకు పట్టాలు రాలేదని వినతులు ఇస్తున్నారు. రీ సర్వే చేసి తమకు హక్కు పత్రాలు ఇవ్వాలని కోరుతున్నారు. తాజాగా చామనపల్లిలో భూ పంపిణీ కింద పట్టాలిచ్చినా.. రెవెన్యూ భూమి కాదని అటవీ భూమిగా పేర్కొంటూ అధికారులు ఇబ్బంది పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. మందమర్రి మండలం బొక్కలగుట్ట శివారులో అటవీ, రెవెన్యూ పట్టా మధ్య ఓ వివాదం ఉంది. అటవీ, రెవెన్యూ భూమి మధ్య స్పష్టమైన హద్దులు లేక సమస్యలున్నాయి. ఆక్రమణలపై ఉన్నతాధికారుల ఆదేశాలు అమలు చేయకపోతే కిందిస్థాయి సిబ్బందిపైనా వేటు పడుతోంది.

**ఆక్రమణలపై సర్వేలు**

ఏటా వానాకాలం సీజన్ ఆరంభంలో అటవీ శాఖ అప్రమత్తం అవుతోంది. ఎక్కడైనా అటవీ భూమి ఆక్రమణకు గురైతే తిరిగి స్వాధీనం చేసుకునేందుకు చర్యలు తీసుకుంటోంది. సాంకేతికతను ఉపయోగించి, జియో మ్యాప్‌తో అక్షాంశ, రేఖాంశాలను ఉపయోగించి ఫారెస్టు బీట్, కంపార్టుమెంట్ల వారీగా గుర్తిస్తున్నారు. గతంలో ఇచ్చిన పట్టా కంటే భూమి ఎక్కువగా వస్తే నోటీసులు ఇస్తున్నారు. ఆ భూమిలో సాగు చేయొద్దని హెచ్చరిస్తున్నారు. అయితే చాలా ఏళ్లుగా సాగులో ఉన్న గిరిజనేతర రైతులకు ఇది కష్టంగా మారింది. పోడు హక్కు పత్రాలు గిరిజనులకు మాత్రమే అందుతాయి. ఎవరైనా పోడు రైతులు సైతం పట్టా కంటే అధికంగా భూమి కబ్జాలో ఉన్నట్లు తేలినా నోటీసులు ఇస్తూ స్వాధీనం చేసుకుంటున్నారు.

## మందమర్రి పట్టణంలో సమస్యలా..!

**మందమర్రిరూరల్:** మందమర్రి మున్సిపాల్టీలోని ప్రజా సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి 'సాక్షి' ముందుకొచ్చింది. నేడు 'సాక్షి' ఆధ్వర్యంలో ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించనుంది. వర్షాకాలం రానున్న దృష్ట్యా మీ పరిధిలోని సమస్యలను ప్రస్తావించి పరిష్కారం కోరవచ్చు. మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు ఫోన్ ఇన్ కార్యక్రమంలో అందుబాటులో ఉంటారు.



మందమర్రి మున్సిపల్ కమిషనర్ రాజలింగు

**'సాక్షి' ఆధ్వర్యంలో నేడు ఫోన్ ఇన్**

**సమయం :** శుక్రవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు

సెల్‌ఫోన్ నంబర్: **77807 82333**

# వన మహోత్సవానికి సన్నద్ధం

- జిల్లాలో 23లక్షల మొక్కలు లక్ష్యం
- ఈత, తాటి వనాల అభివృద్ధికి చర్యలు

**పాతమంచిర్యాల:** జిల్లాలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు జిల్లా అధికారులు సన్నద్ధం అవుతున్నారు. జిల్లాలోని 16మండలాల్లో మొక్కలు నాటడానికి అనువైన స్థలాల ఎంపిక, గుంతలు తీసే కార్యక్రమం ప్రారంభించారు. ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాలు, రోడ్లకు ఇరువైపుల, పొలం, చెరువుగట్లు, బంజరు భూములు, హరితవనాలు, వైకుంఠధామాలు, ఇంటి ఆవరణలో మొక్కల పెంపకానికి చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలోని మండలాల పరిధిలో ఉన్న నర్సరీల్లో పూల మొక్కలు గులాబీ, మల్లె, గుల్‌మోహర్, మందార, తులసీతోపాటు పండ్ల జాతులు జామ, అల్లనేరేడు, దానిమ్మ, చింత, ఖర్జూరా, వృక్షజాతులు టేకు, వేప, కానుగ, మునగ, ఈత, తాటి మొక్కలు నాటనున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంపీడీవో, ఏపీవో, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో స్థలాలు ఎంపిక చేశారు. ఆ తర్వాత ఉపాధి హామీ కూలీలతో గుంతలు తీయిస్తున్నారు. జిల్లాలో ఈత, తాటి వనాల అభివృద్ధికి కల్లు గీత సొసైటీల ద్వారా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. చెరువులు, కాలువ గట్లపై నాటి అభివృద్ధి చేయనున్నారు.

**మండలాల వారీగా..**

జిల్లావ్యాప్తంగా 23లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం నిర్దేశించుకున్నారు. మండలాల వారీగా పరిశీలిస్తే.. బెల్లంపల్లి మండలంలో 12,52,000, భీమారంలో 82,600, భీమినిలో 88,600, చెన్నూర్‌లో 2,20,950, దండేపల్లిలో 2,28,300, హాజీపూర్‌లో 1,25,200, జైపూర్‌లో 1,47,300, జన్నారంలో 2,12,980, కన్నెపల్లిలో 1,12,470, కాసిపేటలో 1,62,000, కోటపల్లిలో 2,27,900, లక్షెట్టిపేటలో 1,32,370, మందమర్రిలో 79,650, నెన్నెలలో 1,39,940, తాండూర్‌లో 1,10,470, వేమనపల్లిలో 1,04,070 మొక్కలు నాటాలని నిర్ణయించారు.



నర్సరీలో పెరుగుతున్న మొక్కలు

**లక్ష్యాన్ని పూర్తి చేస్తాం**



ఈ ఏడాది వన మహోత్సవ లక్ష్యాన్ని పూర్తి చేయడానికి సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లోనే నర్సరీల్లో మొక్కల పెంపకం చేపట్టాం. లక్ష్యాన్ని అధిగమించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. మొక్కలు నాటేందుకు గుంతలు తీసే కార్యక్రమం ప్రారంభమైంది. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జూలైకి మందే మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభిస్తాం.

– ఎస్.కిషన్, డీఆర్డీవో

# కరోనాపై అప్రమత్తం

- మాస్క్ ధరించాలంటున్న డాక్టర్లు
- అందుబాటులోకి ఆర్టీపీసీఆర్ ల్యాబ్
- అప్రమత్తమైన జిల్లా వైద్యారోగ్యశాఖ

**మంచిర్యాలటౌన్:** ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా వైరస్ మరోసారి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోంది. దేశంలోని పలు రాష్ట్రాల్లో కోవిడ్ కేసులు పెరుగుతుండడంతో వైద్యారోగ్యశాఖ అప్రమత్తమైంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు జిల్లా వ్యాప్తంగా వైరల్ జ్వరాలు, దగ్గు, జలుబు, గొంతు నొప్పి, ఒళ్లు నొప్పులతో పలువురు బాధపడుతున్నారు. ఇదే సమయంలో కరోనా మరోసారి విజృంభిస్తుండడంతో భయాందోళన చెందుతున్నారు. వాతావరణం పగలంతా వేడిగా, రాత్రి చల్లగా ఉండడం, వర్షాలు కురుస్తుండడంతో వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకున్నాయి. దీంతో దగ్గు, జలుబు, జ్వరం వచ్చే అవకాశాలున్నాయి. జిల్లాలో కరోనా కేసులు నమోదు కానప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల అధికారులను ప్రభుత్వం అప్రమత్తం చేసింది. కరోనా టెస్టులు, చికిత్స కోసం ప్రత్యేక వార్డుల ఏర్పాటు, కరోనా నిర్ధారణ కోసం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన ఆర్టీపీసీఆర్ ల్యాబ్ పనితీరు, ఆస్పత్రి ఆవరణలోనే గతంలో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ప్లాంట్ పనితీరుపై ఉన్నతాధికారులు మంగళవారం ఆరాతీశారు. మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ప్లాంట్‌ను వినియోగంలోకి తెచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆర్టీపీసీఆర్ ల్యాబ్‌ను సిద్ధం చేస్తున్నారు. కరోనా సోకినవారికి చికిత్స అందించేందుకు ఆస్పత్రిలోనే గతంలో 20 బెడ్‌లతో కూడిన ఐసీయూ వార్డు ఏర్పాటు చేసి వినియోగించగా, అవసరమైతే దానినీ వినియోగంలోకి తేవాలని భావిస్తున్నారు. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీశ్‌రాజ్ మంగళవారం వైద్యులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. జిల్లాలో సీజనల్ వ్యాధులతోపాటు కరోనా వస్తే ఎదుర్కొనేందుకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఆర్టీపీసీఆర్ ల్యాబ్

**గత అనుభవాల దృష్ట్యా..**

2020లో మొదటిసారి కరోనా వచ్చినప్పుడు వేలాదిమంది దాని బారిన పడగా వందలాది మంది మృత్యువాత పడ్డారు. 2020 నుంచి 2023 వరకు జిల్లావ్యాప్తంగా 10,75,447 మందికి కరోనా టెస్టులు నిర్వహించగా 57,305 మంది పాజిటివ్ వచ్చినట్లు నిర్ధారించారు. ఇందులో 205 మంది మృతి చెందినట్లు అధికారికంగా ప్రకటించారు. కరోనా తగ్గుముఖం పట్టడం, వ్యాక్సినేషన్ ప్రక్రియ జిల్లా వ్యాప్తంగా చేపట్టడంతో జిల్లాలోని 5,60,986 మందికి వ్యాక్సిన్ రెండు డోసులు వేశారు. బూస్టర్ డోస్ 3లక్షల మంది మాత్రమే వేసుకున్నారు. ఆ తరువాత కరోనా తగ్గిపోయింది. ప్రజలు కూడా వ్యాక్సిన్ వేసుకున్నందున కరోనా రాదనే ధీమాతో ఉన్నారు. అయినా 2023లో మరోసారి కరోనా రావడంతో కొంత భయాందోళనకు గురయ్యారు. ప్రస్తుతం మరోసారి దేశంలోని పలు రాష్ట్రాల్లో పాజిటివ్ కేసులు నమోదవుతుండగా వైద్యారోగ్యశాఖ అప్రమత్తమైంది. జిల్లా ఉన్నతాధికారులనూ అప్రమత్తం చేసి వైరస్ వ్యాప్తి చెందితే సిద్ధంగా ఉండాలని ఆదేశించింది. గతంలో కరోనా వైరస్‌ను జిల్లా అధికార యంత్రాంగం దీటుగా ఎదుర్కోగా, జిల్లాలో వ్యాధి వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ప్రజలు తప్పనిసరిగా మాస్క్ ధరించాలని, గుంపులుగా ఉన్న ప్రాంతాల్లో జాగ్రత్తలు పాటించాలని, వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు దగ్గు, జలుబు, జ్వరంతో ఉన్నవారికి సన్నిహితంగా ఉండకుండా, తప్పనిసరిగా మాస్కు ధరించేలా చూడాలని వైద్యులు సూచిస్తున్నారు.

**జాగ్రత్తలు పాటించాలి**



ప్రస్తుతం దేశంలో కోవిడ్ కేసులు పెరుగుతున్నందున ప్రజలు జాగ్రత్తలు పాటించాలి. వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. బయటకు వెళ్లేటప్పుడు మాస్కు ధరించాలి. తరచూ చేతులు శుభ్రం చేసుకోవాలి. శానిటైజర్ వినియోగించాలి. తుమ్మేటప్పుడు, దగ్గేటప్పుడు నోటికి, ముక్కుకు అడ్డుగా రుమాలు అడ్డు పెట్టుకోవాలి. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, గర్భిణులు, బాలింతలు, పిల్లలు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. జిల్లాలో కరోనా కేసులు లేకున్నా ముందు జాగ్రత్తలతోనే అడ్డుకోవాలి.

– డాక్టర్ హరీశ్‌రాజ్, జిల్లా వైద్యాధికారి

# మళ్లీ టోల్ వసూళ్లు షురూ

- అటవీ అధికారుల అత్యుత్సాహం
- జాతీయ రహదారిపై అటవీ టోల్‌గేట్

**కోటపల్లి:** మండలంలోని పార్‌పల్లి సమీపంలో జాతీయ రహదారి–63పై ఫారెస్టు టోల్‌గేట్ వసూళ్లకు అటవీ అధికారులు మళ్లీ తెర తీశారు. హరిత ట్యాక్స్ పేరిట టోల్ చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. ఇటీవల కాళేశ్వరం సరస్వతి పుష్కరాలకు వెళ్లే భక్తుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో తాత్కాలికంగా నిలిపివేశారు. టోల్ వసూలుపై స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుండడంతో ఇతర రాష్ట్రాలు, జాతీయ రహదారిపై ప్రయాణించే స్థానికేతరుల నుంచే టోల్ వసూలు చేస్తున్నామని సిబ్బంది చెబుతున్నా అక్కడి వాస్తవ పరిస్థితుల అలా లేవు. చెక్‌పోస్టు సిబ్బంది తాము చెప్పిందే చట్టం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. అన్ని వాహనాలూ టోల్‌స్కానర్ నుంచి వెళ్లి చార్జీలు పడేలా ఏర్పాట్లు చేశారు. స్థానికులా, స్థానికేతరులా అనేది తెలుసుకోవడం లేదు. టోల్ వసూలును ఇటీవల చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి, అటవీశాఖ జిల్లా అధికారి శివ్ ఆశిష్‌సింగ్ ప్రారంభించారు. ఈ టోల్ చెక్‌పోస్టు మీదుగా మహారాష్ట్ర, కాళేశ్వరానికి రెండు వైపుల నిత్యం వందలాది వాహనాలు వెళ్తుంటాయి. ఆటోకు రూ.30, కారు రూ.50, భారీ వాహనాలకు రూ.200 చొప్పున వసూలు చేస్తున్నారు. టోల్‌చెక్‌పోస్టు మీదుగా నిత్యం వందలాది వాహనాలు వస్తుంటాయి. వేగంగా వస్తున్న వాహనాలను ఆపేందుకు అటు డ్రైవర్లు ఇటు సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగి ఎవరు బాధ్యులు, కుటుంబాలను ఎవరు ఆదుకుంటారని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. టోల్ వసూలుపై చెన్నూర్ ఎఫ్‌డీవో సర్వేశ్వర్‌ను సంప్రదించగా.. స్థానికుల వాహనాల నమోదు ప్రక్రియ కొనసాగుతోందని, రెండ్రోజుల్లో పూర్తి అందుబాటులోకి వస్తుందని, స్థానికుల నుంచి చార్జీల వసూలు ఉండదని తెలిపారు.



పార్‌పల్లి ఫారెస్టు టోల్‌గేట్ వద్ద వాహనం

**లోకల్ అని చెప్పినా వసూల్ చేసిర్రు..**

నేను నిత్యం అవసరాల నిమిత్తం గ్రామం నుంచి చెన్నూర్‌కు వెళ్తుంటాను. ఫారెస్టు చెక్‌పోస్టు గుండా వెళ్తుండగా తాత్కాలిక సిబ్బంది అడ్డుకుని టోల్‌గేట్ స్కానర్ వైపు ఉన్న దారి వెంట వెళ్లాలని సూచించారు. మాది లోకల్ వాహనం అని తెలిపినా పట్టించుకోకుండా రూ.50 ఛార్జీ విధించారు. ఇదేమిటని ప్రశ్నించగా మళ్లీ కొద్దిసేపటికి తిరిగి ఇచ్చారు.

– పల్లె సాయి, ఆలుగామ గ్రామస్తుడు

### నేడు ఎమ్మెల్సీ కవిత రాక

**శ్రీరాంపూర్:** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. శ్రీరాంపూర్ బస్టాండ్‌లోని సింగరేణి కార్మికుని విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తారు. అనంతరం జాగృతి కార్యకర్తలు తీగల్‌పహడ్‌లోని కందుల ప్రశాంత్, నస్పూర్ తోళ్లవాగు సమీపంలో శశి ఇళ్లకు వెళ్తారు. గౌతమినగర్‌లో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన సీనియర్ జర్నలిస్టు మునీర్ కుటుంబాన్ని పరామర్శిస్తారు. లక్షెట్టిపేట పట్టణంలో జాగృతి సోషల్ మీడియా కార్యకర్త నిశా ఇంటికి వెళ్తారు. ఈ పర్యటనల కోసం ఆమె అనుచరులు ఏర్పాట్లు చేశారు. బీఆర్‌ఎస్ పార్టీపై ఆమె ఇటీవల సంచలన ప్రకటనలు చేసి నేపథ్యంలో నేటి పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. తాజాగా సింగరేణిలో ప్రత్యేక సింగరేణి జాగృతి కమిటీలు ప్రకటించిన తర్వా త మొదటిసారిగా వస్తున్న ఆమెకు గులాబీ శ్రేణులు స్వాగతం పలుకుతారా లేదా అనే స్పష్టత లేదు. టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలిగా ఉన్న ఆమె సింగరేణికి వస్తున్నా నాయకులకు సమాచారం లేదని తెలిసింది.

### రాజకీయ వ్యవహారాల కమిటీలో పీఎస్సార్



కే.ప్రేమ్‌సాగర్‌రావు

**మంచిర్యాలటౌన్:** తెలంగాణ కాంగ్రెస్ కమిటీలో ఏర్పాటు చేసిన పలు కమిటీలను అధిష్టానం ఆమోదించింది. తెలంగాణ కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీలో సభ్యుడిగా జిల్లాకు చెందిన మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు(పీఎస్సార్)కు చోటు దక్కింది. ఈ కమిటీలో మీనాక్షి నటరాజన్‌తోపాటు పీసీసీ అధ్యక్షుడు, సీఎం, డిప్యూటీ సీఎం తదితరులు 22మంది సభ్యులుగా ఉన్నారు. నలుగురు ఎక్స్ అఫిషియో సభ్యులతోపాటు మంత్రులను ప్రత్యేక ఆహ్వానితులుగా ప్రకటించారు.

# సన్నరకం వడ్లకు బోనస్

- కలెక్టర్ కుమార్ దీపక్
- కొనుగోలు కేంద్రాల సందర్శన

**చెన్నూర్‌రూరల్:** సన్నరకం వడ్లకు మద్దతు ధరతోపాటు రూ.500 బోనస్ చెల్లిస్తామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మండలంలోని ఆస్నాద, గంగారం గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన చెన్నూర్ తహసీల్దార్ మల్లికార్జున్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని వెంటనే కేటాయించిన ప్రకారం రైస్‌మిల్లులకు తరలించాలని, టార్పాలిన్లు, గోనె సంచులు అవసరం మేరకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసినప్పుడు రైతులకు రశీదు ఇవ్వాలని, రైతుల వివరాలు, ధాన్యం వివరాలను ట్యాబ్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు.



ఆస్నాదలో కొనుగోలు కేంద్రం వద్ద కలెక్టర్ కుమార్ దీపక్

**అమృత్ 2.0 పనులు వేగవంతం చేయండి**

**చెన్నూర్:** ప్రజలకు నిరంతరం తాగునీటి సరఫరాకు నిర్మిస్తున్న అమృత్ 2.0 ట్యాంక్ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం ఆయన చెన్నూర్‌లో అమృత్ 2.0 ట్యాంక్ నిర్మాణ పనులను సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ మిషన్ భగీరథ, అమృత్ ద్వారా ప్రతీ ఇంటికి నీరందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. అధికారులు, కాంట్రాక్టర్ల సమన్వయంతో నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### పాముకాటుతో ఎద్దు మృతి



మృతిచెందిన ఎద్దు

కెరమెరి: మండలంలోని శివగూడలో టేకం గుండయ్యకు చెందిన ఎద్దును గురువారం పాము కాటు వేయడంతో మృతి చెందింది. ఉదయం మేతకోసం వెళ్లిన ఎద్దు సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో గుండయ్య మేత మేస్తున్న ప్రదేశానికి వెళ్లిచూడగా మృతి చెంది కనిపించింది. ఎద్దు కాలుకు రెండు పాము కాట్లు కనిపించాయన్నాడు. ఎద్దు విలువ రూ.50 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని గుండయ్య కోరుతున్నాడు.

### గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



దత్తు (ఫైల్)

సాత్నాల: భోరజ్ మండలంలోని తర్నం బ్రిడ్జి వద్ద మంగళవారం వరద నీటిలో గల్లంతైన దత్తు మృతదేహం గురువారం పూసాయి గ్రామ సమీపంలో లభ్యమైనట్లు జైనథ్ ఎస్సై గౌతమ్ పవార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.


### భూమి కాజేసిన ఒకరిపై కేసు

తలమడుగు: నకిలీ పత్రాలు సృష్టించి 25 ఎకరాల భూమిని కాజేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆదిలాబాద్ రూరల్ సీఐ ఫణీందర్ తెలిపారు. గురువారం పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. తలమడుగు మండలంలోని కజ్జర్ల శివారు 246 సర్వేనంబర్‌లో ఉన్న 25 ఎకరాల భూమిని 50 ఏళ్ల క్రితం దేవాపూర్ గ్రామానికి చెందిన అమీరొద్దీన్‌కు ప్రభుత్వం అప్పగించింది. అట్టి భూమిని తలమడుగు మండల కేంద్రానికి చెందిన క్లోం కరుణాకర్‌రెడ్డి నకిలీ పత్రాలు సృష్టించి అమీరొద్దీన్ వారసుడిగా లతీఫొద్దీన్ పేరు మీద పట్టా చేయించాడు. ఆతర్వాత కరుణాకర్‌రెడ్డి పేరుతో రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు క్లోం కరుణాకర్ రెడ్డిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ సీఐ తెలిపారు.

### గంజాయి సేవించిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌రూరల్: గంజాయి సేవించిన బంగారుగూడకు చెందిన ఫేరోజ్ ఖాన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పొచ్చర సర్వీస్ రోడ్డు ప్రాంతంలో గురువారం అనుమానాస్పదంగా తిరుగుతుండగా విచారించి పరీక్షలు నిర్వహించగా పాజిటీవ్ నిర్ధారణ అయినట్లు పేర్కొన్నారు. దీంతో ఫెరోజ్‌ఖాన్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

### కుక్కల దాడిలో నీలుగాయికి గాయాలు



గాయపడిన నీలుగాయి

బోథ్: మండలంలోని కంటెగాం గ్రామ సమీపంలోని అడవిలో బుధవారం సాయంత్రం కుక్కలు దాడి చేయడంతో నీలుగాయికి గాయాలయ్యాయి. గమనించిన గ్రామస్తులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. గురువారం అటవీశాఖ అధికారులు పశువైద్యాధికారులను పిలిపించి చికిత్స చేయించి అడవిలో వదిలేశారు.



# భవితకు భరోసా..!

- మౌలిక వసతులకు నిధులు
- ఉమ్మడి జిల్లాకు రూ.1.59 కోట్లు మంజూరు



మందమర్రిలో నిర్మించిన భవిత కేంద్రం

మంచిర్యాలఅర్బన్: భవిత కేంద్రాలకు మహర్దశ పట్టనుంది. దివ్యాంగ పిల్లలకు భరోసానిచ్చే భవిత కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించనున్నారు. ర్యాంపులు, రైలింగ్‌తో పాటు మరుగుదొడ్ల నిర్మాణం, ఇప్పటికే ఉన్న భవనాలకు మరమ్మతులు, కార్యకలాపాల గది నిర్మాణం, పిల్లలకు అనుకూలమైన అభ్యాస వాతావరణం కోసం అవసరాలకు అనుగుణంగా ఆధారిత పెయింటింగ్‌కు నిధులు మంజూరు చేస్తూ తెలంగాణ సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. మంచిర్యాల జిల్లాలోని 18 మండలాల్లో భవిత కేంద్రాలుండగా ఐదు చోట్ల మాత్రమే పక్కా భవనాలున్నాయి. మిగిలిన భవిత కేంద్రాలు పాఠశాల ఆవరణలో కొనసాగుతున్నాయి. 196 మంది ప్రత్యేక అవసరాలుగల పిల్లలుండగా ఒక్కో కేంద్రానికి ఇద్దరు ఐఈఆర్‌పీల చొప్పున 36 మందికిగానూ 24 మంది విధులు నిర్వహిస్తున్నారు. 12 ఖాళీలు భర్తీ చేయాల్సి ఉంది. భవిత కేంద్రాల్లో చేపట్టే పనుల అంచనాలు రూపొందించడంలో అధికారులు నిమగ్నమయ్యారు. అదనపు నిధులు అవసరమైతే జస్టిఫికేషన్ నివేదికతో ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశాలొచ్చాయి.

**కేంద్రాల బలోపేతానికి..**

భవిత కేంద్రాల్లో 196 మంది ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులున్నారు. ఇందులో 92 మంది ఇంటివద్దే ఉంటూ తగిన సేవలు అందుకుంటున్న వారున్నారు. మానసిక దివ్యాంగులు, చెవిటి, మూగ, అంధత్వం ఇలా 21 రకాలుగా పాఠశాలలకు వచ్చిన విద్యార్థులను గుర్తించి సేవలు అందిస్తున్నారు. వచ్చే ఏడాది నుంచి భవిత కేంద్రాల బలోపేతంపై కన్వర్జెన్స్‌లో దృష్టి సారించాలని పలు సూచనలు చేశారు. నమోదును పెంచటం, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలందరినీ గుర్తించి భవిత కేంద్రాల్లో చేర్చటానికి ప్రత్యేక ప్రయత్నాలు చేయాల్సి ఉంటుంది. రవాణా సౌకర్యం నిర్ధారించడం, పిల్లలకు వ్యక్తిగత అవసరాల ఆధారంగా అవసరమైన చికిత్స జోక్యాలు, మద్దతు అందించటానికి ఫిజియోథెరపిస్టులు, స్పీచ్ థెరపిస్టులు క్రమం తప్పకుండా సందర్శించాలని సూచించారు. గతేడాది భవిత కేంద్రాలకు అవసరమైన పరికరాలు కొనుగోలు చేసేందుకు నిధులు కేటాయించగా, అవసరమైన పరికరాలు అందుబాటులో ఉంచాలని పొందుపర్చారు. ప్రతీ చిన్నారి విద్యాపరంగా, అభివృద్ధిలో పురోగతి సాధించటంపై దృష్టి కేంద్రీకరించాల్సి ఉంటుంది. స్వయం సహాయక సంఘాల సహాయంతో సీఎస్‌డబ్ల్యూయస్ గుర్తింపు వందశాతం కవరేజీకి చేరుకోవాలని ఉత్తర్వుల్లో పొందుపర్చారు.

**పక్కా భవనాలు ఎప్పుడో..?**

ఉమ్మడి జిల్లాలో భవిత కేంద్రాలకు 17 చోట్ల పక్కా భవనాలున్నాయి. మిగిలిన 53 చోట్ల భవనాలులేక పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నారు. భవిత కేంద్రాలకు అవసరమైన మౌలిక వసతులకు నిధులు కేటాయించినా పక్కా భవనాల నిర్మాణం విస్మరించారు. తాండూర్, బెల్లంపల్లి, దండేపల్లి, మందమర్రి, కోటపల్లిలో మాత్రమే భవిత కేంద్రాలున్నాయి. మిగిలిన కేంద్రాల్లో సమస్యలు తిష్టవేశాయి. భవిత భవనాల నిర్మాణానికి స్థలగుర్తింపునకు ఎంఈవోలకు అప్పగించినట్లు తెలుస్తోంది. వీటినెంత త్వరగా స్థల కేటాయింపు, నిధులు మంజూరు చేస్తేనే ప్రత్యేక అవసరాల పిల్లలకు సౌకర్యంగా మారనుంది.

**నిధుల ఖర్చు ఇలా..**

ఉమ్మడి జిల్లా భవిత కేంద్రాల్లో చేపట్టే పనులకు నిధులు ఖర్చు చేయడంపై మార్గదర్శకాలు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాకు రూ.1,59,57,764 నిధులు మంజూరయ్యాయి. ప్రాధాన్యత ప్రాతిపదికన అవసరాలను గుర్తించాలని కలెక్టర్‌కు సూచించారు. కార్యకలాపాల గది నిర్మాణానికి యూనిట్‌కు రూ.7 లక్షల వరకు, ర్యాంపు, రైలింగ్‌తో కూడిన యాక్సెస్ చేయగల టాయిలెట్ నిర్మాణానికి యూనిట్‌కు రూ.లక్ష, భవనాల మరమ్మతులకు రూ.లక్ష (అవసరం ప్రకారం), ఇప్పటికే ఉన్న టాయిలెట్ల మరమ్మతులకు రూ.50వేలు, పిల్లల అభ్యాస, అవసరాలకు అనుగుణంగా పెయింటింగ్‌కు రూ. 1.50 లక్షలు ఖర్చు చేయాలని నిబంధనలున్నాయి.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పక్కా భవనాలు, పాఠశాల ఆవరణలో కొనసాగుతున్న భవనాలు, మంజూరైన నిధులు ఇలా ఉన్నాయి.

| జిల్లా | పక్కా భవనాలు | పాఠశాల ఆవరణలో | మంజూరైన నిధులు |
| --- | --- | --- | --- |
| ఆదిలాబాద్ | 4 | 14 | రూ.42,24,114 |
| కుమురంభీం | 4 | 11 | రూ.35,20,095 |
| నిర్మల్ | 4 | 15 | రూ.44,58,787 |
| మంచిర్యాల | 5 | 13 | రూ.37,54,768 |
| మొత్తం | 17 | 53 | రూ.1,59,57,764 |

## వాటర్ ట్యాంకు ఎక్కి యువకుడి హల్‌చల్



ట్యాంకు పైకి ఎక్కిన జాబ్రీ జమీల్

నస్పూర్: తనకు న్యాయం చేయాలని ఓ యువకుడు గురువారం పట్టణ పరిధిలోని వాటర్ ట్యాంకు ఎక్కి హల్‌చల్ చేశాడు. ఎస్సై ఉపేందర్‌రావు న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో కిందకు దిగాడు. ఈ సందర్భంగా బాధితుడు జాబ్రీ జమీల్ మాట్లాడుతూ తనది విలేజ్ నస్పూర్ గ్రామమని, నస్పూర్ శివారు సర్వే నంబర్ 22లోని 6 ఎకరాల భూమిని మహ్మద్ ఫిరోజ్‌ఖాన్, మరి కొందరితో కలిసి 2015 లో కొనుగోలు చేశామన్నాడు. అందులో తనకు పది శాతం వాటా ఉందన్నాడు. కొంత కాలం తర్వాత ఫిరోజ్‌ఖాన్ తన పదిశాతం వాటా కింద రూ.30 లక్షలు ఇస్తానని 2016లో అగ్రిమెంట్ చేసుకుని రూ.2.50 లక్షలు చెల్లించాడన్నారు. మిగిలిన డబ్బులు ఇవ్వకుండా భూమిని ఇతరులకు అమ్ముకున్నారని ఆరోపించారు. రెండు రోజుల్లో న్యాయం చేయాలని, లేనిపక్షంలో కుటుంబ సభ్యులతో సహా ఆత్మహత్య చేసుకుంటామన్నారు. అనంతరం యువకుడిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## ఇంటర్ సప్లిమెంటరీ మూల్యాంకనం ప్రారంభం



అవగాహన కల్పిస్తున్న డీఐఈవో అంజయ్య

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల మూల్యాంకనం గురువారం ప్రారంభమైంది. మొదటి రోజు తెలుగు, ఇంగ్లిషు, గణితం, పొలిటికల్ సైన్స్ సబ్జెక్టుల మూల్యాంకనం చేశారు. మూల్యాంకనానికి నియమించిన 120మంది రిపోర్టు చేశారు. డీఐఈవో అంజయ్య పర్యవేక్షణలో మూల్యాంకనం కోసం సమన్వయ సమావేశం అసిస్టెంట్ ఆఫీసర్, చీఫ్ ఎగ్జామినర్, అసిస్టెంట్ ఎగ్జామినర్, సబ్జెక్టు విషయ నిపుణులతో జరిగింది. స్పాట్ వాల్యుయేషన్‌పై అవగాహన కల్పించారు. మొదటి రోజు ఒక్కొక్కరికి 15 చొప్పున జవాబు పత్రాలు ఇచ్చినట్లు డీఐఈవో అంజయ్య తెలిపారు.

## హైదరాబాద్‌లో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్



యూనియన్‌లోకి ఆహ్వానిస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: కార్మికులకు మెరుగైన వైద్యం అందించేందుకు కంపెనీ హైదరాబాద్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఏర్పాటు చేయబోతుందని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు తెలిపారు. గురువారం ఆ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీసైదా శ్రీరాంపూర్‌లోని ఎస్ఆర్పీ 1 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు యజమాన్యంతో చర్చించామన్నారు. త్వరలోనే ఆస్పత్రి పనులు ప్రారంభమవుతాయన్నారు. అంతే కాకుండా భూపాలపల్లి, కొత్తగూడెం, రామగుండం సెక్టార్ 3లలో కార్మికుల పిల్లల కోసం సింగరేణి పాఠశాలలో సీబీఎస్ సిలబస్‌ను ప్రవేశపెట్టబోతున్నారన్నారు. ఈ సందర్భంగా 30 మంది కార్మికులు ఏఐటీయూసీలో చేరగా వారికి కండువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, జీఎం కమిటీ చర్చల ప్రతినిధులు ప్రసాద్‌రెడ్డి, బద్రి బుచ్చయ్య, గొల్లపల్లి రాంచందర్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, పిట్ కార్యదర్శి దాడి రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

## భర్త వేధింపులతో భార్య ఆత్మహత్య



సురేఖ (ఫైల్)

సాత్నాల: భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య చేసుకున్న సంఘటన భోరజ్ మండలంలోని రాంపూర్(టి)లో గురువారం చోటు చేసుకుంది. జైనథ్ ఎస్సై గౌతమ్ పవార్ తెలిపిన వివరాల మేరకు జైనథ్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన శంకర్‌కు భోరజ్ మండలంలోని రాంపూర్(టి) గ్రామానికి చెందిన సురేఖ (35)తో 13 ఏళ్ల క్రితం వివాహమైంది. దంపతులకు కుమారుడు, కూతురు ఉన్నారు. కొంత కాలంగా శంకర్ మద్యానికి బానిసయ్యాడు. ఇంటికి వచ్చి భార్యను వేధిస్తుండడంతో పుట్టింటికి వెళ్లిపోయింది. బుధవారం రాత్రి మద్యం మత్తులో అత్తారింటికి వెళ్లి భార్యతో గొడవకు దిగడంతో కుటుంబ సభ్యులు 100కు సమాచారం అందించారు. పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చి వదిలిపెట్టారు. గురువారం ఉదయం మరోసారి అత్తారింటికి వెళ్లి భార్యతో గొడవకు దిగాడు. దీంతో మనస్తాపానికి గురైన సురేఖ ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. శంకర్ పారిపోయేందుకు ప్రయత్నించగా స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. అయితే ఇది ఆత్మహత్య కాదని, ఆమె భర్త ఉరివేసి హత్యచేశాడని ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులను సముదాయించారు. మృతురాలి తల్లి రాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

## కట్నం వేధింపుల కారణంగా మహిళ..

ఆదిలాబాద్‌టౌన్: అదనపు వరకట్న వేధింపులతో ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ సీఐ సునిల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లాలోని సింగరాయికొండకు చెందిన బండి ప్రసన్న (29)కు ఆంధ్రకు చెందిన ప్రమోద్ కుమార్‌తో 2022లో వివాహమైంది. పెళ్లయిన మూడు నెలల వరకు దంపతుల కాపురం సజావుగా సాగింది. ఆ తర్వాత అదనపు వరకట్నం కోసం ప్రమోద్ కుమార్ వేధించడం ప్రారంభించాడు. ఇటీవల ఉపాధి నిమిత్తం జిల్లా కేంద్రానికి వచ్చి ద్వారకానగర్‌లో భార్యతో కలిసి అద్దెకు ఉంటున్నాడు. మానసికంగా, శారీరకంగా వేధింపులకు పాల్పడుతుండడంతో బుధవారం ఉదయం భర్త పనికి వెళ్లగా ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భర్త మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూసేసరికి చీరతో ఉరేసుకుని కనిపించడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు గురువారం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి



ఆకాష్, కళ్యాణ్ (ఫైల్)

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలో జాతీయ రహదారి 44పై గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందినట్లు సీఐ స్వామి తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్‌కు చెందిన దాడి ఆకాష్ (21), అల్లకొండ కళ్యాణ్ (23) శుభకార్యాలకు డెకరేషన్ చేస్తుంటారు. బుధవారంరాత్రి ఇచ్చోడ నుంచి ఆదిలాబాద్‌కు ద్విచక్ర వాహనంపై వస్తుండగా మార్గమధ్యలో గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించగా జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆకాష్ అదేరోజు రాత్రి, కళ్యాణ్ గురువారం మృతి చెందారు. ఆకాష్ తండ్రి రాజేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

### గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు..

భైంసారూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. సీఐ నైలు తెలిపిన వివరాల మేరకు మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన సయ్యద్ బషీర్ (20) బుధవారం రాత్రి చాక్‌పెల్లి వెళ్లేందుకు గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై నిలబడి ఉన్నాడు. ఈక్రమంలో భైంసా నుంచి నిర్మల్ వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టి వెళ్లిపోయింది. తీవ్రగాయాలు కావడంతో గమనించిన స్థానికులు భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

### కన్నెపల్లిలో ఒకరు..

దండేపల్లి: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని కన్నెపల్లి గ్రామానికి చెందిన బోరె మహేశ్ (40) గురువారం రాత్రి ద్విచక్ర వాహనంపై కన్నెపల్లి నుంచి లక్సెట్టిపేటకు వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై తహసీనొద్దీన్ ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని లక్సెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

### రైలులోంచి కిందపడి వ్యక్తి..

బెల్లంపల్లి: రైలులోంచి కిందపడి ఒకరు మృతి చెందినట్లు బెల్లంపల్లి జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ కె.సురేష్‌గౌడ్ తెలిపారు. నాగపూర్‌కు చెందిన నిషాంత్ (42) బుధవారం రాత్రి హుబ్లీలో ఉన్న తన బంధువుల ఇంటికి వారణాసి ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరాడు. రైలు బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌కు చేరుకోగానే నిషాంత్ రైలులో నుంచి కిందపడిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహానికి గురువారం పంచనామా, పోస్టుమార్టం నిర్వహించి భార్య పూర్వీకి అప్పగించామని రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

### కుక్కల దాడిలో ముగ్గురికి గాయాలు

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని బూర్గుడ ఎస్సీ కాలనీలో గురువారం వీధి కుక్కల దాడిలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామానికి చెందిన కళావతి, లక్ష్మి, లస్మబాయి ఇంటి ముందు కూర్చొని ఉండగా వీధి కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. ముగ్గురికి గాయాలు కావడంతో జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు.

### ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



సతీశ్ మృతదేహం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన కొండేటి సతీశ్ (38) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై సత్తయ్య తెలిపారు. మేస్త్రీపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న సతీశ్ ఇటీవల రెండు ప్లాట్లు కొనుగోలు చేసి ఇంటినిర్మాణం చేపట్టాడు. ఈక్రమంలో అప్పులు చేశాడు. అంతేకాకుండా కొంతకాలంగా భార్యపై అనుమానం పెంచుకోవడంతో ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయితీలు సైతం జరిగాయి. ఒకవైపు అప్పులబాధ, మరోవైపు కుటుంబ సమస్యలతో మనస్తాపానికి గురయ్యాడు. బుధవారం రాత్రి ఎప్పటిలాగే వరండాలో ఒంటరిగానే పడుకున్నాడు. తెల్లవారేసరికి రేకుల షెడ్డుకు ఉరేసుకుని కనిపించాడు. మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని అతని తండ్రి మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

### కొత్తూర్‌లో యువకుడు..

ఆదిలాబాద్‌టౌన్: తలమడుగు మండలంలోని కొత్తూర్ గ్రామానికి చెందిన ఉల్లెంగుల రవి (36) బుధవారం సాయంత్రం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఖుర్షీద్‌నగర్‌లోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్న రవి ఆర్థిక పరిస్థితుల కారణంగా ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. ఈ మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వివరించారు.

### రావి శ్రీనివాస్‌పై కేసు నమోదు



బెజ్జూర్‌లో ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబును అసభ్య పదజాలంతో దూషించిన కాంగ్రెస్ నాయకుడు రావి శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు టౌన్ ఎస్సై సురేశ్ గురువారం తెలిపారు. సోషల్ మీడియాలో అసభ్య పదజాలంతో దూషిస్తూ పోస్టు చేసినట్లు తెలిపారు. రావి శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కె.శివకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

బెజ్జూర్: ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రావి శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలని గురువారం బీజేపీ కార్యకర్తలు బెజ్జూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు జాడి తిరుపతి, మండల మాజీ అధ్యక్షుడు జాడి దిగంబర్, నాయకులు వసీఉల్లాఖాన్, తాళ్ల ఇందిరా, రాజారామ్, ప్రవీణ్, కిష్టయ్య, కృష్ణ, శ్యాంసుందర్, రుషి, గోపాల్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

## హోరాహోరీగా క్రికెట్ ఎంపిక పోటీలు



జిల్లా కేంద్రంలో ఆడుతున్న క్రీడాకారులు

మంచిర్యాలటౌన్: ఆదిలాబాద్ జిల్లా క్రికెట్ అసోసియేషన్, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టును ఎంపిక చేసేందుకు నిర్వహిస్తున్న పోటీలు మూడోరోజు గురువారం హోరాహోరీగా సాగాయి. మంచిర్యాల పట్టణంలోని ఉషోదయ స్కూల్‌లో గ్రీన్, బ్లూ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో బ్లూ జట్టు 268 పరుగులు చేసి విజయం సాధించింది. హాజీపూర్ మండలంలోని గుడిపేట 13వ పోలీసు బెటాలియన్‌లో నిర్వహించిన పోటీల్లో యెల్లో జట్టు 165 పరుగులు చేసి విజయం సాధించింది. మందమర్రిలోని సింగరేణి మైదానంలో జరుగుతున్న పోటీల్లో వైట్ జట్టు 229 పరుగులు చేసి విజయం సాధించిందని హెచ్‌సీఏ కోచ్ ప్రదీప్ తెలిపారు.

## మొక్కజొన్నల చోరీ నిందితుల అరెస్ట్




వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ ఉపేంద్రరెడ్డి

నర్సాపూర్(జి): ఏప్రిల్ 23న 325 క్వింటాళ్ల మొక్కజొన్నలు చోరీ చేసిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నిర్మల్ ఏఎస్పీ ఉపేంద్రరెడ్డి తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బాధితుడు కల్లూరుకు చెందిన బొద్దుల శ్రీనివాస్ మే13న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్పీ జానకీ షర్మిల ఆదేశాలతో ఒక ప్రత్యేక టీం ఏర్పాటు చేసి విచారణ చేపట్టారు. నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం రాజీవ్ నగర్ తాండకు చెందిన బాదావత్ సంతోశ్, కంటేశ్వర్‌కు చెందిన అబ్దుల్ రజాక్ లారీ డ్రైవర్లు 325 క్వింటాళ్ల మొక్కజొన్నలను కామారెడ్డి సమీపంలో ఉన్న స్నేహ చికెన్ ఫార్మ్ గోదాంకు పీవీ ఏజెన్సీ ద్వారా విక్రయించి రూ.7,48,000 సొమ్ము చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. గురువారం భైంసా నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న ఇద్దరు నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో తామే విక్రయించినట్లు నిందితులు అంగీకరించారు. వారి వద్దనుంచి 2 లారీలు, 3 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

### 'గురుకుల సొసైటీ కార్యదర్శిని తొలగించాలి'



మాట్లాడుతున్న రాజనర్సు

బెల్లంపల్లి: గురుకుల విద్యాలయ సొసైటీ కార్యదర్శి అలగు వర్షిణిని ఆ పదవి నుంచి వెంటనే తొలగించాలని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిలుక రాజనర్సు డిమాండ్ చేశారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ గురుకులాల్లో విద్యార్థులు మరుగుదొడ్లు కడిగితే తప్పేంటని, గదులు శుభ్రం చేసుకోవడంతో పాటు కూరగాయలు తరగాలని, ఎవరి బట్టలు వారే ఉతుక్కోవాలని వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఎస్సీలకు చెందిన ఉన్నతాధికారిని గురుకుల సొసైటీ కార్యదర్శిగా నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో నాయకులు రమేశ్, నారాయణ, రాజ్‌కుమార్, ప్రసాద్, శేఖర్, శివాజీ, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

### నేడు వైద్యారోగ్య శాఖలో ఖాళీలకు ఇంటర్వ్యూలు

మంచిర్యాలటౌన్: జాతీయ ఆరోగ్య మిషన్ కింద ఎన్‌హెచ్‌ఎం విభాగంలో ఖాళీగా ఉన్న రెండు నర్సింగ్ ఆఫీసర్, 1 డీఈఎం పోస్టుల భర్తీకి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీశ్‌రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30న ఉదయం 11 గంటలకు నస్పూరులోని కలెక్టరేట్‌లో ఉన్న జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఒరిజినల్ సర్టిఫికేట్లతో హాజరు కావాలని తెలిపారు. వివరాలకు జిల్లా అధికారిక వెబ్‌సైట్ https:// mancherial. telangana. gov. in లో సంప్రదించాలని తెలిపారు.

### తర్లపాడ్‌లో అగ్నిప్రమాదం

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్‌లో గురువారం రాత్రి పల్లపు లక్ష్మి ఇంట్లో కట్టెలపొయ్యి వద్ద వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. ఫైరింజన్‌కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది మంటలు ఆర్పివేశారు.